స్వాభిమానం, ధైర్యం, సామాజిక న్యాయం,
ప్రజా ప్రతిఘటనకు ప్రతీకగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్


3లో

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

బేడ బుడగ జంగం జన సంఘం జిల్లా అధ్యక్షులుగా
సిరిగిరి జంపయ్య ఏకగ్రీవ ఎన్నిక



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 234 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 19 ఆగస్టు 2026

# ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

● సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్ గొప్ప యోధుడు ● హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ ● 2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం ● బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు ● ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం ● విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. మిగతా2లో...



# వెంకయ్యనాయుడిని ఆదర్శంగా తీసుకోండి

● సామాన్యుడిగా వచ్చి..అసామాన్యుడిగా ఎదిగారు
● కార్యకర్తలకు బిజెపి అధ్యక్షుడు నబీన్ హితోక్తి

**విశాఖపట్నం,ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కార్యకర్త నుంచి జాతీయ నాయకుడిగా ఎదిగిన భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పోరాటాల స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని బీజేపీ శ్రేణులకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే బీజేపీ మిగతా2లో...

## బిఆర్ఎస్‌తో పోలిస్తే రెండింతలుగా భూ ఆక్రమణలు

22ఎ నిషేధిత జాబితా పేరుతో దోపిడీకి స్కెచ్
రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ ఎంపి ఈటెల రాజేందర్



**హైదరాబాద్,ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాల కంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ రెండింతలు పెరిగిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. మిగతా2లో...

# నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారం

- ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం
- 24 గంటల్లోనే 34 రిజిస్ట్రేషన్లు పూర్తి తప్పను సరిదిద్దుకుంటున్నాం
- మీడియాతో మంత్రి పొంగులేని వివరణ


2లో


2లో

## ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

● తాగునీటికే తొలి ప్రాధాన్యం... పంటలకూ భరోసా కల్పించాలి ● అందుబాటులో ఉన్న నిల్వల ఆధారంగానే నిర్ణయాలు ● కృష్ణా బేసిన్‌లో 76.63 శాతం.. గోదావరి బేసిన్‌లో 68.1 శాతం నిల్వలు ● నాగార్జునసాగర్‌లో 164 టీఎంసీల నీరు.. ఇంకా 47 శాతం వరద జలాలకు అవకాశం ● సింగూరు మరమ్మతులకు అత్యధిక ప్రాధాన్యం ● అంతర్రాష్ట్ర జల వివాదాలపై పటిష్ట వాదనకు సమగ్ర కార్యాచరణ ● నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

# పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రం
పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలకు ఆహ్వానం
2035 నాటికి 26,000 మెగావాట్ల సోలార్, 8,000 మెగావాట్ల విద్యుత్ లక్ష్యం
హైటెక్స్‌లో 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్,ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడి దారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవాటెల్ లో రెండు రోజుల పాటు జరగనున్న 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ / ఎక్స్ పో 2026'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్‌కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు మరియు సాంకేతిక నిపుణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు... మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడి దారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవ డానికి మరియు కలిసి ఎదగడానికి మిమ్మల్ని పూర్ణహృదయంతో ఆహ్వానించడానికి ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది' అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే మిగతా2లో...



## బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

ఇష్టం వచ్చినట్లుగా ఓట్లు తొలగించడం అన్యాయం
22శాతం ఓట్ల తొలగింపు దుర్మార్గపు చర్య
తెలంగాణలో సర్ ప్రక్రియను పొడిగించాలి
పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ డిమాండ్

**హైదరాబాద్,ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** 2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలో ఎన్నికల సంఘాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని మిగతా2లో...

# 22ఏ నిషేధిత జాబితాను వెంటనే ఎత్తేయాలి

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలి
● పనిచేయని టోల్ ఫ్రీ నెంబర్ : ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



**ఉప్పల్,ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** భూములు, ఆస్తులను 22ఏ నిషేధిత జాబితా నుంచి వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ప్రజలను ఇబ్బం దులకు గురిచేస్తున్న రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి వాజపేయినగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో హరీశ్‌రావు మాట్లాడారు. మల్కాజిగిరిలో 60 ఏండ్ల నివాసిత ఇండ్లను కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి ప్రజలను ఆందోళనకు గురిచేయడం సమంజసం కాదన్నారు. న్యాయబద్ధంగా, కష్టార్జితంతో సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలంటూ ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిందని, అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని చెప్పారు. నిషేధిత జాబితాను వెంటనే తొలగించకపోతే రాష్ట్ర ప్రభుత్వాన్ని స్తంభింపజేసేలా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లాలో 7,500 జీవోల ద్వారా మినహాయింపు పొందిన భూములు, మేడ్చల్‌లో మిగతా2లో...

# వెంకయ్యనాయుడిని ఆదర్శంగా తీసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

అతి పెద్ద పార్టీగా ఉందని అన్నారు. దేశాన్ని మరింత శక్తిమంతంగా చేయడానికి సంకల్పం తీసుకోవాలని ప్రతి కార్యకర్తకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో మంచి పాలన అందుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమికి మంచి విజయాన్ని అందించిన ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించడానికి కూటమి ఏర్పాటైందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై ప్రధాన మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారని గుర్తు చేశారు. తమ కలలను సాకారం చేసే పార్టీని ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. అనేక ప్రాజెక్టులు ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి డబల్ ఇంజిన్ సర్కార్ పని చేస్తుందని అన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. విపక్షం కాంగ్రెస్ పార్టీ అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తుందని మండిపడ్డారు. దీనిని తిప్పి కొట్టాలని బీజేపీ శ్రేణులకు సూచించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతారహిత్యంగా ప్రధాని మోదీపై వ్యాఖ్యలు చేస్తున్నారని గుర్తు చేశారు. వాటిని ఖండించాలని పార్టీ శ్రేణులకు బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యల్లో నిరాశ కనపడుతోందని వ్యాఖ్యానించారు. విపక్షం వాడే భాష.. దేశాన్ని అస్థిర పరిచేలా ఉందన్నారు. దేశం ముందుకెళ్తుంటే సహించలేక పోతున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల వైఖరిని ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు.ప్రస్తుత రాజకీయాల్లో విపక్షాలు, పార్ట్ టైం నాయకుల్లా తయారయ్యారని వ్యంగ్యంగా అన్నారు. యువతను ప్రభుత్వం మీద రాళ్ల విసిరేందుకు వాడితే.. మనం దేశ నిర్మాణానికి వాడుతున్నామని చెప్పారు. దేశంలోని యువతతో మమైకం కావాలని ఈ సందర్భంగా పార్టీ కేడర్‌కు సూచించారు. బీజేపీ జాతీయ వాదంతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. అన్ని వర్గాల వద్దకు వెళ్లి పార్టీని ముందుకు తీసుకెళ్లి.. బలోపేతం చేయ్యాలని పార్టీ శ్రేణులను ఆయన దిశానిర్దేశర చేశారు. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రాప్రదేశ్ దిశగా పనిచేయాలని శ్రేణులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీలో ఈ ఏడాదిలో జరిగిన అభివృద్ధిపై పుస్తకాన్ని జాతీయ బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ ఆవిష్కరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ జాతీయ కమిటీలో పదవులు పొందిన దగ్గుబాటి పురందేశ్వరి, విష్ణువర్ధన్ రెడ్డిని ఈ సందర్భంగా నితిన్ నబిన్ సన్మానించారు.

# ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ. 8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇరిగేషన్ కాల్వలపై ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు .పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారం

**హైదరాబాద్,ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** 22ఏ నిషేధిత భూముల జాబితాలోకి పొరపాటున చేరిన ప్రైవేట్ భూముల సమస్యను పరిష్కరించే ప్రక్రియను వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 24 గంటల్లోనే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4.. మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు.మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 22ఏ జాబితా విషయంలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో క్షేత్రస్థాయిలో కొన్ని తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దే ప్రక్రియను ప్రభుత్వం వేగంగా చేపట్టిందని వివరించారు. ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం లేదని పొంగులేటి అన్నారు. పొరపాటు జరిగితే దాన్ని అంగీకరించడం తో పాటు.. దాని వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిష్కరించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన కొన్ని ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు కూడా సాంకేతిక కారణాలతో 22ఏ జాబితాలోకి చేరినట్లు తెలిపారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభించామని, అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించామని మంత్రి వెల్లడించారు. 22ఏ భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పొంగులేటి తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ ప్రతిరోజూ దరఖాస్తులను పరిశీలించనుందని, అర్హత ఉన్న నిజమైన ప్రైవేట్ ఆస్తులను వీలైనంత త్వరగా 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. పేదల హక్కులు, ఆస్తులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు.


చట్టబద్ధంగా ఉన్న పేదల భూమిలో ఒక్క అంగుళాన్ని కూడా ప్రభుత్వం తీసుకోదని అన్నారు. ఇది పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. 22ఏ సమస్యను రాజకీయంగా ఉపయోగించుకోవద్దని మంత్రి కోరారు. ప్రజల్లో అనవసరమైన ఆందోళన సృష్టించేలా ఆరోపణలు, ప్రచారం చేయడం సరికాదన్నారు. 'మేం జరిగిన తప్పును అంగీకరించి సరిదిద్దుతున్నాం. ప్రజలను ఇబ్బందుల్లో వదిలేయడం మా ప్రభుత్వ విధానం కాదు' అని స్పష్టం చేశారు. అధికారులపై బాధ్యత నెట్టేసి ప్రభుత్వం చేతులు దులుపుకోదని, సమస్యకు పరిష్కారం చూపించడమే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

విప్లవాత్మక ప్రక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2035 నాటికి 26,000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి అత్యంత కీలకమైన 'విద్యుత్ నిల్వ' సామర్థ్యాన్ని కూడా భారీగా విస్తరిస్తున్నామని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, ఎఐ నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయబోయే ఎఐ డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12,000 ఇ÷ం ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను ఇక్కడే తయారు చేసే కంపెనీలకు మూలధన సాయం, రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు వేగవంతమైన అనుమతులు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని, తెలంగాణతో కలిసి నడవాలని పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను ఆయన సందర్శించారు. డిప్యూటీ సీఎం వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు.

# వందేమాతరమంటే కాంగ్రెస్‌కు భయం: బండి



**హైదరాబాద్,ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ఖర్గే తీరుపై ప్రతి భారతీయుడు ఆశ్చర్యానికి లోనవుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం ఆలపించకుండా అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. వందేమాతరం ఆలపించడాన్ని చూసి ఒకప్పుడు బ్రిటీష్ వాళ్లు భయపడ్డారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని ఎద్దేవా చేశారు. బ్రిటీష్ వాళ్లకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య తేడా కనిపించడం లేదన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్, ఎంఐఎం మాత్రమే వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నాయని.. ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు.

# 22ఏ నిషేధిత జాబితాను వెంటనే ఎత్తేయాలి

(మొదటి పేజీ తరువాయి)

6 వేలకుపైగా భూములతో పాటు హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు.ఎలాంటి దరఖాస్తులూ తీసుకోకుండా, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత మంత్రిని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మంత్రి చేసిన తప్పులపై ముఖ్యమంత్రి చర్యలు తీసుకోకపోతే ఇద్దరూ కలిసి కుట్రపూరితంగా భూదందాకు పాల్పడ్డారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయన్నారు. ఈ అంశంపై అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. తెలంగాణ భవన్‌లోని జనతా గ్యారేజీ తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు అక్కడికి రావాలని సూచించారు.ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను నిలిపివేయాలని, 22ఏ నిషేధిత జాబితా నుంచి ఆస్తులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. 22ఏ నిషేధిత జాబితా విషయంలో ప్రభుత్వం రాత్రికి రాత్రే జీవోలు జారీ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, బద్దం పరుశు రాంరెడ్డి, వీరేష్‌యాదవ్, వెంకన్న, నందికంటి శ్రీధర్, ఖలీల్, కార్పొరేటర్ విజయశాంతి, రాము, సునీత యాదవ్, శిరీషారెడ్డి, జగదీష్‌గౌడ్, రామచందర్ యాదవ్, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ ఫామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు.

# బిఆర్ఎస్‌తో పోలిస్తే రెండింతలుగా భూ ఆక్రమణలు

(మొదటి పేజీ తరువాయి)

నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేసీఆర్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూములు, పరిశ్రమల కోసం ఇచ్చిన స్థలాలు, చివరకు ప్రభుత్వమే లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని ఈటల మండిపడ్డారు. దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం వెనుక భూమాఫియాకు అప్పగించే కుట్ర ఉందని ఆరోపించారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసినప్పటికీ భూములను లాక్కునే ప్రభుత్వాల విధానంలో ఎలాంటి మార్పు రాలేదని ఈటల విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు పాల్పడితే.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే భూములను సెటిల్‌మెంట్ చేసుకుంటోందని ఆరోపించారు. గతంలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఖర్చు చేసిన డబ్బులు ఇలాంటి భూ దందాల ద్వారా వచ్చినవేనంటూ ఈటల సంచలన ఆరోపణలు చేశారు. గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూములు ఫీనిక్స్ కంపెనీ ద్వారా ఎలా చేతులు మారాయో అందరికీ తెలుసని ఈటల పేర్కొన్నారు. ఈ వ్యవహారాల్లో పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. పేదలు, రైతులకు అన్యాయం చేస్తూ రియల్ ఎస్టేట్ మాఫియాలకు కొమ్ముకాయడం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భూ అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం కొనసాగుతుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అయితే, ఈ సమావేశంలో ఈటల చేసిన ఆరోపణలపై ప్రభుత్వం లేదా సంబంధిత వర్గాల స్పందన వెలువడాల్సి ఉంది.

# ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

**హైదరాబాద్,ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆకాశం వైపు ఆశగా చూడటం ఒక్కటే జల నిర్వహణ కాదు... ఆనకట్టలో ఎంత నీరుంది, అందులో నిజంగా వినియోగించగలిగేది ఎంత, తాగునీటికి ఎంత కాపాడాలి, నిలువునా ఉన్న పంటకు ఎంత అందించగలం అన్న ప్రతి లెక్కలో శాస్త్రీయత, వాస్తవికత ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి కొనసాగుతున్నందున 'తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం... అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ' అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి పెద్దఎత్తున వరదలు వస్తాయని ముందుగానే ఊహించుకొని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం చేతిలో ఉన్న నీరే ప్రామాణికం కావాలి... నమ్మదగిన ప్రవాహాలే అంచనాలకు ఆధారం కావాలి... వర్షపాతంపై శాస్త్రీయ విశ్లేషణే నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. మన విధానం సమతుల్యంగా, వివేకవంతంగా ఉండాలి. ప్రజల తాగునీటి అవసరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకూడదు. అదే సమయంలో తాగునీటి అవసరాలకు మించి అందుబాటులో ఉన్న నీరు జలాశయాల్లో ఉన్నప్పుడు పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఉండకూడదు. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవంగా వినియోగించగల నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవిక వర్షపాత అంచనాల ఆధారంగానే జరగాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ÷ృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉండి, 76.63 శాతం నిల్వలు నమోదయ్యాయని సమీక్షలో వెల్లడైంది. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు స్థూల సామర్థ్యం సుమారు 312 టీఎంసీలు కాగా, ఇంకా దాదాపు 47 శాతం మేర వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు.

# స్వాభిమానం, ధైర్యం, సామాజిక న్యాయం, ప్రజా ప్రతిఘటనకు ప్రతీకగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**బోడుప్పల్ ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** బోడుప్పల్ లో సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి అంగరంగ వైభవంగా బోడుప్పల్ సర్దార్ పాపన్న సేన అధ్యక్షుడు ఎల్లికట్టి ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులుగా సీసా నరసింహ గౌడ్ శ్రీనివాస్ గౌడ్, గాయత్రి నగర్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్, మునిని శ్రీనివాస్ గౌడ్, వీరన్నపేట్. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ చరిత్రలో ప్రముఖ ప్రజావీరుడు. ఆయనను సాధారణ ప్రజల హక్కుల కోసం పోరాడిన ధైర్యశాలి, సామాజిక సమానత్వం కోసం కృషి చేసిన యోధుడిగా గుర్తిస్తారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సుమారు 17వ శతాబ్దం చివరి 18వ శతాబ్దం ప్రారంభ కాలంలో తెలంగాణ ప్రాంతంలో జీవించారు. గౌడ్ సామాజిక వర్గానికి చెందిన పాపన్న, ఆ కాలంలో కొనసాగిన సామంత, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. పాపన్న తన అనుచరులను సమీకరించి ఒక స్వతంత్ర సైనిక శక్తిని నిర్మించారు. ప్రజలపై అధిక పన్నులు, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుతూ అనేక ప్రాంతాలను తన ఆధీనంలోకి తీసుకున్నారు. ఆయన నిర్మించిన ఖిలా షాపూర్ కోట మరియు ఇతర కోటలు ఆయన సైనిక సామర్థ్యానికి ప్రతీకలుగా నిలిచాయి. ఆ కాలంలో మొఘల్ సామ్రాజ్య ప్రభావం తెలంగాణలో బలంగా ఉన్నప్పటికీ, పాపన్న తన స్వతంత్ర పాలనను స్థాపించేందుకు ప్రయత్నించారు. సామాన్య ప్రజలు, వెనుకబడిన వర్గాలు, అణగారిన వర్గాల నుంచి ఆయనకు మద్దతు లభించినట్లు చారిత్రక సంప్రదాయాలు చెబుతున్నాయి. పాపన్న గౌడ్ చివరకు మొఘల్ సైన్యంతో జరిగిన పోరాటాల్లో ఓడిపోయి 1709 ప్రాంతంలో మరణించినట్లు చరిత్రలోని పలు వర్ణనలు పేర్కొంటాయి. అయితే ఆయన చేసిన పోరాటం తెలంగాణ ప్రజల జ్ఞాపకాల్లో వీరగాథగా నిలిచింది. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వారసత్వం ఆయనను నేడు స్వాభిమానం, ధైర్యం, సామాజిక న్యాయం, ప్రజా ప్రతిఘటనకు ప్రతీకగా స్మరించుకుంటారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఆయన జ్ఞాపకార్థం అధికారికంగా వివిధ కార్యక్రమాలు నిర్వహి స్తోంది. అణచివేతకు తలవంచ కుండా, ప్రజల కోసం పోరాడిన తెలంగాణ ప్రజావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బిజెపి స్టేట్ గీతాసెల్ మాజీ అధ్యక్షులు పంజాల శ్రవణ్ గౌడ్, బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ పూలకండ్ల జంగారెడ్డి, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్ రెడ్డి, ఎమ్మెస్సార్ రామ్ రెడ్డి, లక్ష్మీ నగర్ మాజీ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, అమరలింగారెడ్డి, బీసీ లీడర్ గజ్జల సత్యరాజ్, చంద్రమౌళి,ముత్యాల శ్రీ నూతన గౌడ, సంఘం ఉపేందర్ గౌడ్, రాజబాబు, సందీప్ మాజీ ఎంపీటీసీ నాదం గౌడ్, ప్రెసిడెంట్ రామకృష్ణ గౌడ్, అంజి రెడ్డి, పి సాటి దశరథ్,బోడుప్పల్ వాకర్స్ గ్రూప్ మరియు బోడుప్పల్ సెటిలర్ చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, సర్దార్ పాపన్న ఆశయ సాధకుడు సత్తన్న గౌడ్, ఆర్ఎస్ఎస్ యాదగిరి గుప్తా, రమేష్ గౌడ సంఘం కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# బేడ బుడగ జంగం జన సంఘం జిల్లా అధ్యక్షులుగా సిరిగిరి జంపయ్య ఏకగ్రీవ ఎన్నిక





**వరంగల్ టౌన్, ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** బేడ బుడగ జంగం జన సంఘం వరంగల్ జిల్లా నూతన అధ్యక్షులుగా సిరిగిరి జంపయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ బాలాజీ నగర్ లో జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకులు సిరిపాటి వేణు నూతన కమిటీని ప్రకటించి, జంపయ్యకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిరిపాటి వేణు మాట్లాడుతూ.. ఎస్సీ జాబితాలోని బేడ బుడగ జంగాలకు రావాల్సిన విద్యా, ఉద్యోగ హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో హక్కుల సాధన కోసం ఉధృత ఉద్యమాలు చేస్తామని తెలిపారు. నూతన అధ్యక్షుడు సిరిగిరి జంపయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కార్యవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లావ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించి, కుల బాంధవులను ఒక్కతాటిపైకి తెచ్చి సంఘ బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. నూతన కమిటీ అధ్యక్షులు సిరిగిరి జంపయ్య, ఉపాధ్యక్షుడు తూర్పాటి రవి, ప్రధాన కార్యదర్శి పస్తం శంకర్, కోశాధికారి వారణాసి పెద్ద లక్ష్మి, ఉప ప్రధాన కార్యదర్శి గంధం పరమేష్, ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తూర్పాటి లింగయ్య, ఉపాధ్యక్షుడు రాజు పలేందర్, ప్రధాన కార్యదర్శి పత్తి బసవ శివ, ఇతర నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కిరాయి సర్టిఫికెట్లతో ఫార్మసీలు నడిపితే చర్యలు తప్పవు

**సర్టిఫికెట్ ఎవరిది? ఫార్మసీలో ఉంటున్నది ఎవరు? మందులు ఇస్తున్నది ఎవరు?**

**కిరాయి సర్టిఫికెట్ల దందాకు అడ్డుకట్ట వేయాలి డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు నిరంతరం తనిఖీలు నిర్వహించాలి**

**తెలంగాణ రాష్ట్ర ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రపు నరేష్**




**ములుగు జిల్లా, ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఫార్మసిస్టుల సర్టిఫికెట్లను కిరాయికి తీసుకుని ఫార్మసీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్న సందర్భాల్లో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రపు నరేష్ కోరారు. ఫార్మసీ లైసెన్స్‌లో నమోదైన ఫార్మసిస్టు వాస్తవంగా ఆ ఫార్మసీలో విధులు నిర్వహిస్తున్నారా? సర్టిఫికెట్ ఇచ్చిన వ్యక్తి నిజంగానే షాపులో అందుబాటులో ఉంటున్నారా? రోగులకు మందులు అందిస్తున్నది నమోదిత ఫార్మసిస్టేనా? అనే అంశాలను అధికారులు తనిఖీల సమయంలో స్పష్టంగా పరిశీలించాలని ఆయన అన్నారు. **“సర్టిఫికెట్ మాత్రమే సరిపోదు.. వృత్తిపరమైన బాధ్యత కూడా ఉండాలి”** కేవలం ఫార్మసిస్టు సర్టిఫికెట్‌ను ఉపయోగించుకుని ఫార్మసీ నిర్వహించే విధానం నిబంధనలకు విరుద్ధంగా ఉంటే, అలాంటి వ్యవహారాలను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని నరేష్ కోరారు. తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారికంగా ఫార్మసీల తనిఖీలు, నిబంధనల అమలు పర్యవేక్షణను నిర్వహిస్తోంది. తనిఖీల్లో నమోదిత ఫార్మసిస్టు లేకుండా ప్రిస్క్రిప్షన్ మందులు అందించడం వంటి ఉల్లంఘనలను కూడా గుర్తించి చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. **“సర్టిఫికెట్ ఎవరిది? షాపులో ఫార్మసిస్టు ఉన్నాడా?** మందులు ఇచ్చేది ఫార్మసిస్టేనా?” అనే మూడు ప్రశ్నలకు ప్రతి ఫార్మసీలో స్పష్టమైన సమాధానం ఉండేలా తనిఖీలు జరగాలని ఆయన అన్నారు. **డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు మరింత పటిష్టం కావాలి** డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల ప్రధాన బాధ్యతల్లో భాగంగా ఫార్మసీల్లో నిబంధనల అమలును పరిశీలించడం, ఉల్లంఘనలను గుర్తించడం, అవసరమైనప్పుడు చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని నరేష్ పేర్కొన్నారు. అందువల్ల తనిఖీలు కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే కాకుండా, నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా నిర్వహించాలని కోరారు. తెలంగాణ ఐజూా అధికారిక తనిఖీ విధానాల్లో ఫార్మసీ లైసెన్స్, సంస్థ వివరాలు, నిబంధనల అనుసరణ తదితర అంశాలను పరిశీలించే చెక్‌లిస్టులు కూడా ఉన్నాయి. **ఫార్మసిస్టులే ఫార్మసీలను నిర్వహించేలా ప్రోత్సహించాలి** ఫార్మసీ విద్యను అభ్యసించిన వారు కేవలం సర్టిఫికెట్‌ను కిరాయికి ఇవ్వకుండా, తమ అర్హతను ఉపయోగించుకుని స్వయంగా ఫార్మసీలు నిర్వహించేలా ప్రభుత్వం, సంబంధిత అధికారులు ప్రోత్సహించాలని నరేష్ అన్నారు. తోటి ఫార్మసిస్టుకు అన్యాయం జరుగుతున్న ప్పుడు “నాకెందుకులే.. నా సర్టిఫికెట్ నేను చూసుకుం టా” అనే ధోరణి కాకుండా, ఫార్మసిస్టులందరూ ఐక్యం గా నిలబడి వృత్తి గౌరవాన్ని కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. “సర్టిఫికెట్ కిరాయికి కాదు.. స్వావలం బనకు. ఫార్మసిస్టు పేరు లైసెన్స్‌లో మాత్రమే కాదు.. ఫార్మసీలో వృత్తిపరమైన బాధ్యతలోనూ కనిపించాలి.” అని తెలంగాణ రాష్ట్ర ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రపు నరేష్ స్పష్టం చేశారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు

- చింతపల్లి సొసైటీ అధ్యక్షులు జేరిపోతుల రంగన్న గౌడ్





**సీరోల్ ఆగస్టు18(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలం చింతపల్లి గ్రామంలో చింతపల్లి గౌడ సొసైటీ అధ్యక్షులు జేరిపోతుల రంగన్న గౌడ్ అధ్యక్షతన తో చింతపల్లి బొడ్రాయి సెంటర్లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలును ఘనంగా నిర్వహించి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద గౌడ్ కొంపెల్లి సైదులు గౌడ్. మడ్డి వీరన్న గౌడ్. వేముల రామకృష్ణ గౌడ్. పామర్తి రామదాసు గౌడ్. వేముల వెంకటనారాయణ గౌడ్. పామర్తి వీరన్న గౌడ్. చిర్ర అశోక్ గౌడ్. మడ్డి చంద్రయ్య గౌడ్. పామర్తి అంజయ్య గౌడ్. దొంతగాని వీరన్న గౌడ్. మడ్డి వీరభద్రం గౌడ్ వేమగాని వెంకన్న గౌడ్. అండెం అంజయ్య గౌడ్. గంధసిరి యాకయ్య గౌడ్. దొంతగాని నరేష్ గౌడ్. కొంపేల్లి రఘు గౌడ్. దొంతగాని రామన్న గౌడ్ మా గౌడ కుటుంబ సభ్యులు యువత అధిక సంఖ్యలో పాల్గొని పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు.

# ఓటరు తుది జాబితా వచ్చేవరకు ‘బీఎల్ఏ-2’లు క్షేత్రస్థాయిలో పనిచేయాలి...

**- ఎస్ఐఆర్ ఫేజ్ -2 పై కరీంనగర్, మానకొండూర్ నియోజకవర్గ శ్రేణులకు**

**బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ఆంతోనీ రెడ్డి , జిల్లా అధ్యక్షుడు సాయిని**

**మల్లేశం దిశా నిర్దేశం...**



**మానకొండూర్ ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో ఓటరు తుది జాబితా వెలువడే వరకు బూత్ లెవెల్ ఏజెంట్-2 లు నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ఓటర్లకు అవగాహన కల్పించాలని బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ ఆంతోనీ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. ఎస్ ఐ ఆర్ ఫేజ్ 2 ప్రక్రియపై మంగళవారం కరీంనగర్, మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ శ్రేణులతో వేర్వేరుగా ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదా డ్రాఫ్ట్ లిస్టులో ఆబ్సెంట్ , షిఫ్టెడ్ , డూప్లికేట్ ఓట్లు అత్యధికంగా ఉన్నట్లు తేలిందని, డ్రాఫ్ట్ లిస్ట్ విడుదల కావడంతో తమ ఓటు ఉందో లేదోననే ఆందోళన కరీంనగర్, మానకొండూర్ నియోజకవర్గ ఓటర్లలో నెలకొన్న. దృశ్య పార్టీ శ్రేణులు వారికి అండగా ఉండి పూర్తి భరోసా కల్పించాలని కోరారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరుతో ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ ద్వారా సరిచూసుకోవచ్చని నేతలు సూచించారు. ఒకవేళ అర్హత ఉండి కూడా ముసాయిదా జాబితాలో పేరు లేకపోతే వెంటనే సంబంధిత బీఎల్ఓ లేదా ఎన్నికల అధికారులను సంప్రదించేలా ఓటర్లకు సహాయం చేయాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల అధికారుల నుండి నోటీసులు అందుకున్నటువంటి ఓటర్లు నిర్దేశిత గడువు సెప్టెంబర్ 16 లోగా సరైన ఆధారాలతో స్పందించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు బీఎల్ఏ-2లు తగిన సహకారం అందించాలని నేతలు సూచించారు. ఫారం-6: కొత్త ఓటరు నమోదు కోసం, ఫారం-7: ఓటుపై అభ్యంతరాలు లేదా తొలగింపుల ప్రక్రియ కోసం. ఫారం-8: ఓటరు వివరాలలో మార్పులు లేదా సవరణల కోసం వినియోగించాలని సూచించారు. ఎస్ ఐ ఆర్ జిల్లా ఇంచార్జీ ఎ ్ా రి బ ా బ ు మాట్లాడుతూ. రాష్ట్రంలో అక్టోబర్ 19వ తేదీన తుది ఓటర్ల జాబితా విడుదల కానున్న నేపథ్యంలో, అప్పటి వరకు రెండు నియోజకవర్గాల్లోని ప్రతి బూత్ స్థాయిలో పార్టీ ప్రతినిధులు అలర్ట్‌గా ఉంటూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బాధ్యతగా పనిచేయాలని వారు స్పష్టం చేశారు. బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ రావు, ఎస్ ఐ ఆర్ జిల్లా ఇంచార్జి హరి బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, వాసాల రమేష్, గుజ్జ శ్రీనివాసరావు, నాంపల్లి శ్రీనివాస్ , మానకొండూరు ఎస్ఐఆర్ కన్వీనర్ రంగు భాస్కరాచారి, బి ఎల్ ఏ 1, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మానకొండూరు నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి , మండల, జోన్ అధ్యక్షులు, ఇంచార్జి లు, బి ఎల్ ఏ లు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు , నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా కలెక్టర్ బోర్కాడే హేమంత్, ఐ.ఏ.ఎస్‌ని సన్మానం

- తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్



**ములుగు జిల్లా ఆగష్టు18(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కలెక్టర్ శ్రీ బోర్కాడే హేమంత్, ఐ.ఏ.ఎస్. గారిని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ నెల 16వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు మరియు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క గార్ల చేతుల మీదుగా ములుగు జిల్లా ఉమ్మడి సమీకృత కార్యాలయాల భవనం ప్రారంభోత్సవం, అలాగే రాష్ట్ర పంచాయతీరాజ్ రోడ్ల పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేసినందుకు జిల్లా కలెక్టర్ శ్రీ బోర్కాడే హేమంత్, ఐ.ఏ.ఎస్. గారికి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా శాఖ పక్షాన శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా అధ్యక్షులు శ్రీ ఎం. సంపత్ రావు గారు కలెక్టర్‌ను సన్మానించారు. అదేవిధంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ సి. హెచ్. మహేందర్ గారిని కూడా జిల్లా అధ్యక్షులు శ్రీ ఎం. సంపత్ రావు గారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో TGOs జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ కందుల జీవన్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీ కొమరయ్య, ఉపాధ్యక్షులు శ్రీమతి కే. శిరీష, శ్రీ విజయ భాస్కర్, శ్రీ ఏ. రాజ్ కుమార్, శ్రీ బి. యశ్వంత్, జాయింట్ సెక్రెటరీలు శ్రీ రఫీక్, శ్రీమతి శైలజ, శ్రీ డి. రాజు, శ్రీ రహీముద్దీన్, అలాగే శ్రీమతి ప్రేమలత, శ్రీ ధర్మానాయక్, శ్రీ కృపాకర్, శ్రీ సంజీవ రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో బిఆర్ఎస్ పోరుబాట

### కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి
### పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలిచిన పథకాలను నిలిపివేసే కుట్రలను అడ్డుకుంటాం: మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

**సత్తుపల్లి, ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సత్తుపల్లిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ నిరసన కార్యక్రమంతో పోరుబాట పట్టారు. సత్తుపల్లిలోని ఆర్అండ్బీ గెస్ట్‌హౌస్ నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలి అంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదింటి ఆడబిడ్డలకు అండగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అన్నారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో పేద కుటుంబాల కష్టాలను గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచేందుకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. తొలుత రూ.50 వేలతో ప్రారంభించిన ఈ పథకం ఆర్థిక సహాయాన్ని అనంతరం రూ.1,00,116కు పెంచి, వేలాది నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. ప్రస్తుతం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులు ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నారని సండ్ర వెంకట వీరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పథకానికి సంబంధించి న్యాయ పరమైన అంశాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం సకాలంలో స్పందించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. **హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కళ్యాణలక్ష్మి పథకం కింద ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని సండ్ర గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా ఆ హామీపై ప్రభుత్వం ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలతో పాటు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. పేదల సంక్షేమానికి





సంబంధించిన పథకాలపై నిర్లక్ష్య వైఖరిని విడనాడి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సకాలంలో ప్రయోజనం అందించాలని డిమాండ్ చేశారు.**రైతు బీమాపై కూడా నిర్లక్ష్యం వద్దు** మరోవైపు రైతులకు భరోసాగా నిలిచిన రైతు బీమా పథకం విషయంలోనూ ప్రభుత్వం



నిర్లక్ష్యం చేయవద్దని సండ్ర వెంకట వీరయ్య కోరారు. రైతు బీమా ప్రీమియాన్ని సకాలంలో చెల్లించి, రైతు కుటుంబాలకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకు ప్రజల్లో లభించిన ఆదరణను చూసి వాటిని నిర్వీర్యం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సండ్ర ఆరోపించారు. పేదలు, రైతులు, మహిళలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. **పేదల పక్షాన బీఆర్ఎస్ నిరంతర పోరాటం**కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే యథావిధిగా కొనసాగించాలని, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా ఆర్థిక సహాయం అందించాలని సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. పేదల సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే, బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి పోరాటం చేస్తుందని సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు.

---

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే అమలు చేయాలి

### యూరియా కోసం ఆన్‌లైన్ యాప్ విధానం ఎత్తివేయాలి
### చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలి
### కల్లూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ: సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం

**కల్లూరు, ఆగస్టు 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే చర్యలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కల్లూరు మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రతాప్ ల్యాబ్ అధినేత యూత్ అధ్యక్షులు కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ ఇంటి వద్ద నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెయిన్ సెంటర్ బైక్ ర్యాలీ చేపట్టారు. బిఆర్ఎస్ నాయకులు పాదయాత్రతో ఎన్ఎస్పి సబ్ కలెక్టర్ కార్యాలయమునకు చేరుకున్నారు. అనంతరం సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌కు కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ గతంలో అమలైన సంక్షేమ పథకాలను



కొనసాగించడంతో పాటు అర్హులైన పేద కుటుంబాలకు ఎలాంటి జాప్యం లేకుండా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. **యూరియా కోసం రైతుల అవస్థలు** రైతులకు యూరియా అందించేందుకు అమలు చేస్తున్న ఆన్‌లైన్ యాప్ విధానాన్ని వెంటనే తొలగించి, ప్రతి రైతుకు సులభంగా ఎరువులు అందేలా ప్రత్యామ్నాయ విధానం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యాప్‌లో యూరియా బుక్ చేసుకునేందుకు రైతులు తమ వ్యవసాయ పనులను సైతం పక్కనపెట్టి గంటల తరబడి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఎంతసేపు ప్రయత్నించినా బుకింగ్ కాకపోవడంతో రైతుల శ్రమ, సమయం వృథా అవుతోందని



ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉంచాలని, రైతులకు సులభంగా ఎరువులు పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. **చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలి** అనంతరం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులను కలిసి సాగునీటి పరిస్థితిపై వివరించారు. కాలువల చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. చివరి ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా నీటి సరఫరాను పర్యవేక్షించాలని, అవసరమైన చోట కాలువల మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, మాజీ జెడ్పీటీసీ



కట్టా అజయ్‌కుమార్, కౌన్సిలర్లు లక్కినేని రఘు, బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ, సొసైటీ చైర్మన్ బోబోలు లక్ష్మణరావు, మాజీ సొసైటీ చైర్మన్ పెద్దబోయన మల్లేశ్వరరావు, బీఆర్ఎస్ మండల నాయకులు కొరకొప్పు ప్రసాద్, కాటంనేని వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచులు వేము కృష్ణ, జినుగు శ్రీనివాసరావు, కోలేటి శ్రీను, గూగులోత్ శ్రీను, మాజీ సర్పంచ్ విజయ్ రావు, మాజీ వార్డు సభ్యులు సీనియర్ నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ గొల్లమందల ప్రసాద్, అంకిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు మేకల కృష్ణ, జర్పుల లీలావతి, కౌన్సిలర్ లు మహమ్మద్ ఇస్మాయిల్, సయ్యద్ రేష్మ ఇంతియాజ్, మాజీ సర్పంచ్ కుక్క అంజన్ రావు, మాజీ సర్పంచ్ గంగవరపు శ్రీనివాసరావు, అజ్మీర్ జమలయ్య, వల్లపునేని రవి, బానోతు కృష్ణ, ఖమ్మంపాటి రమేష్, షేక్ కమ్లి, చారుగుండ్ల సందీప్, కిరణ్, తదితర నాయకులు, రైతులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగించడం దుర్మార్గం

### బీఆర్ఎస్ మల్లంపల్లి మండల యూత్ అధ్యక్షుడు మొర్రి రాజు యాదవ్

**మల్లంపల్లి ఆగస్టు 18 (పీసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ మల్లంపల్లి మండల యూత్ అధ్యక్షుడు మొర్రి రాజు యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. విగ్రహాన్ని తొలగించగలరేమో కానీ లక్షలాది మంది ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న పెద్ది సుదర్శన్‌రెడ్డిని ప్రజల గుండెల్లోంచి ఎవరూ తొలగించలేరని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉమ్మడి జిల్లా నుంచి అహర్నిశలు పోరాడిన ఉద్యమ నాయకుడిగా పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజల మనసుల్లో నిలిచిపోయారని రాజు యాదవ్ పేర్కొన్నారు. నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో నియోజకవర్గ అభివృద్ధితో పాటు అణగారిన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. అలాంటి ప్రజా నాయకుడి విగ్రహాన్ని తొలగించి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. పెద్ది సుదర్శన్‌రెడ్డిపై ప్రజలకు ఉన్న అభిమానానికి ఆయన అంతిమయాత్రే నిదర్శనమని, ఆ యాత్రకు తరలివచ్చిన లక్షలాది మంది ప్రజలే ఆయన ప్రజాదరణకు సాక్ష్యమని అన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని అడ్డుకోవడం, ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించడం




ద్వారా ప్రభుత్వం ప్రజల మనోభావాలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. అధికారులను అడ్డుపెట్టుకొని విగ్రహాన్ని తొలగించేలా చేయడం ద్వారా చనిపోయిన నాయకుడిపై కూడా రాజకీయ కక్ష సాధింపు ధోరణిని ప్రదర్శించడం దురదృష్టకరమన్నారు. "పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం కేవలం ఒక విగ్రహం కాదు.. తెలంగాణ ఉద్యమ చరిత్రకు, ప్రజా పోరాటాలకు ప్రతీక. దానిని తొలగించినంత మాత్రాన ప్రజల హృదయాల్లో ఉన్న ఆయన స్థానాన్ని ఎవరూ చెరపలేరు" అని రాజు యాదవ్ అన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ప్రజల ముందుంటే గత పాలన, ప్రస్తుత పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటారనే భయంతోనే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ, పెద్ది సుదర్శన్‌రెడ్డి పట్ల ప్రభుత్వానికి ఉన్న భయానికి విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడమే నిదర్శనమని అన్నారు. తెలంగాణ ప్రజలు జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నారని, ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్యలకు భవిష్యత్తులో ప్రజలే తగిన సమాధానం చెబుతారని రాజు యాదవ్ హెచ్చరించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న దుష్ట విధానాలే రానున్న రోజుల్లో ఆ ప్రభుత్వానికి గడ్డు పరిస్థితులు ఎదురుకానున్నాయనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు.

---

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు



**హనుమకొండ, ఆగస్టు 18 (పీసిడబ్ల్యూ న్యూస్):**బాలసముద్రంలోని ఏకశిల పార్క్ ప్రాంగణంలో శ్రీ కౌండిన్య గౌడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బహుజన రక్షకుడు, వీరయోధుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు దేశిని సిద్ధార్థ గౌడ్, మోడెం ఉమేష్ గౌడ్ మాట్లాడుతూ... బహుజన రాజ్యాధికారం కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడిన సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆయన చూపిన బాటలోనే నడుస్తూ సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌండిన్య గౌడ్స్ అసోసియేషన్ కార్యదర్శి బయ్యగాని కుమారస్వామి గౌడ్, నాయకులు విజయ్ గౌడ్, మూల ప్రసాద్ గౌడ్, సతీష్ గౌడ్, కొండం సత్యనారాయణ గౌడ్, పొగాకుల నగేష్ గౌడ్, బండి మల్లేశం గౌడ్, బండి ఐలయ్య గౌడ్, వాకర్స్ మిత్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నీటి లభ్యతకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలి

**రైతు వేదికల ద్వారా ప్రత్యామ్నాయ**
**పంటలపై విస్తృత అవగాహన కల్పించాలి**
**రైతుల సమస్యలు, సూచనలను**
**స్వయంగా అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్**
**సమస్యల పరిష్కారంలో స్పష్టమైన పురోగతి**
**ఉండాలి:జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

**ములుగు జిల్లా ఆగష్టు18(పిసిడబ్ల్యూ న్యూస్):** నీటి లభ్యతకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణపై రైతులు దృష్టి సారించాలని, రైతు వేదికల ద్వారా ప్రత్యామ్నాయ పంటలపై అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని, సమస్యల పరిష్కారంలో స్పష్టమైన పురోగతి ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.మంగళవారం నూతన కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నీటిపారుదల, వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో సంయుక్త సలహా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, సాగునీటి లభ్యత, పంటల సాగు పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వయంగా రైతులతో మాట్లాడి ఆయా మండలాలు, గ్రామాల్లో నెలకొన్న వ్యవసాయ పరిస్థితులు, సాగునీటి సమస్యలు, పంటల సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రత్యామ్నాయ పంటలపై వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తెలిపిన ప్రతి అంశాన్ని అధికారులు నమోదు చేసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ములుగు జిల్లాలో అత్యధిక శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నందున రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖల అధికారులు ఒకే వేదికపై చర్చించడం ద్వారా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలకు సరైన పరిష్కార మార్గాలను గుర్తించవచ్చన్నారు.మే నెల నుంచే ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు పరిస్థితులపై రైతులకు రైతు వేదికలు, ప్రచార మాధ్యమాల ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నీటి లభ్యతను అంచనా వేసుకోకుండా పంటలు సాగు చేసి రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఆగస్టు నెలలో జిల్లాలో వర్షపాతం తీవ్రంగా తగ్గిందని కలెక్టర్ తెలిపారు. జిల్లా మొత్తంగా సాధారణ వర్షపాతం 218 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా 83 మిల్లీమీటర్లు మాత్రమే నమోదై, సుమారు 62 శాతం వర్షపాతం లోటు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రస్తుత పరిస్థితులను రైతులు గమనించి నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.రైతులు పూర్తిగా వరి పంటపైనే ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కొంత విస్తీర్ణంలో వరి సాగు చేస్తూనే మిగతా భూముల్లో తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను చేపట్టడం ద్వారా వర్షాభావ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చన్నారు.ఆయా ప్రాంతాల నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను బట్టి ఏయే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవచ్చనే అంశంపై రైతులకు పూర్తి సమాచారం అందించాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అన్ని రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారులతో సమావేశాలు నిర్వహించి, రైతులకు అనుకూలమైన పంటలు, సాగు విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత




అవగాహన కల్పించాలని సూచించారు.ఉద్యానవన పంటల సాగుకు అవకాశమున్న ప్రాంతాలను గుర్తించి రైతులకు తగిన సాంకేతిక సలహాలు అందించాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలు, ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు.కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న సాగునీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. చెరువులు, కుంటల్లో పూడికతీత, వి బి జి రామ్ జి పథకం ద్వారా చేపట్టగల నీటి సంరక్షణ పనులను పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రైతులు సమావేశంలో ప్రస్తావించిన సమస్యల్లో జిల్లా స్థాయిలో పరిష్కరించగల అంశాలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో పరిష్కారం కావాల్సిన అంశాలను సంబంధిత ఉన్నతాధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రతి సమస్యకు సంబంధించి ఏ స్థాయిలో చర్యలు తీసుకోవాల్సి ఉందో స్పష్టంగా గుర్తించాలని అధికారులకు సూచించారు.రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య నిరంతర సమన్వయం ఉండేందుకు తరచూ సమావేశాలను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశాల్లో కేవలం సమస్యలను ప్రస్తావించడం కాకుండా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సాధించిన పురోగతిని కూడా సమీక్షించాలని పేర్కొన్నారు.ప్రతి సమావేశానికి అధికారులు స్పష్టమైన పురోగతి నివేదికతో హాజరు కావాలని, పరిష్కారమైన సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అంశాలు, తీసుకున్న చర్యల వివరాలను అందించాలని ఆదేశించారు. సమావేశాలు ఫలితాల ఆధారంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో స్పష్టమైన మార్పు కనిపించినప్పుడే వాటికి సార్థకత ఉంటుందని తెలిపారు.జిల్లాలో ఉన్న వర్షపాతం లోటును రైతులు గుర్తించి పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై సానుకూలంగా ఆలోచించాలని కలెక్టర్ కోరారు. ప్రజాప్రతినిధులు కూడా తమ పరిధిలోని రైతులకు వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల అవసరం, నీటి పొదుపు అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.రైతులు పండించిన వరితో పాటు ఇతర పంటలకు కూడా అవసరమైన సమయంలో ప్రభుత్వ పరంగా సహకారం అందేలా చర్యలు ఉంటాయని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, సమ్మయ్య, ఆత్మ కమిటీ జిల్లా చైర్మన్ రఘు, డివిజన్ చైర్మన్లు రవీందర్ రెడ్డి, అరుణ, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో గణేష్ మండపాలన్నింటికీ ఉచిత కరెంట్

**కరెంట్ ఛార్జీలన్నీ కరీంనగర్ ద**
**కార్పొరేషన్ చెల్లించాలని నిర్ణయం**
**దాదాపు 2 వేల గణేష్ మండపాలకు**
**ఉచిత కరెంట్ సరఫరా చేయాలనే లక్ష్యం**
**గత మూడేళ్లుగా గణేష్ మండపాల కరెంట్ బిల్లులన్నీ చెల్లించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**
**ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బంది లేకుండా గణేశ్ మండపాలను ఏర్పాటు చేసుకోవాలని కేంద్ర మంత్రి సూచన**
**ఉత్సాహంగా భక్తియుత వాతావరణంలో**
**గణేశ్ ఉత్సవాలు నిర్వహించుకోవాలని విజప్తి**
**అభివృద్ధి, ఉత్సవాల్లో కరీంనగర్ కార్పొరేషన్‌ను**
**మోడల్ గా తీర్చిదిద్దుతానని వెల్లడి**
**16వ డివిజన్ లోని లక్ష్మీపూర్, మల్కాపూర్‌లోనూ**
**అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి**

**కరీంనగర్ టౌన్ ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న వినాయక మండపాలన్నింటికీ ఉచితంగా కరెంట్ ను అందించాలని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. అందుకు అయ్యే కరెంట్ బిల్లులన్నీ కరీంనగర్ కార్పొరేషన్ చెల్లిస్తుందని ప్రకటించారు. భక్తియుత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో ఏటా దాదాపు 2 వేల గణేశ్ మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. గత మూడేళ్లుగా ఈ మండపాలకు వినియోగిస్తున్న కరెంట్ ఛార్జీలను మొత్తం బండి సంజయ్ కుమార్ తన సొంత డబ్బులు వెచ్చించి చెల్లిస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించిన నేపథ్యంలో ...గణేశ్ మండపాల కరెంట్ బిల్లులన్నీ కార్పొరేషన్ చెల్లించాలని నిర్ణయం తీసుకోవడం విశేషం.కరీంనగర్ పర్యటనలో భాగంగా ఈరోజు 21వ డివిజన్ విద్యానగర్ లోని శ్రీరాంనగర్ కాలనీలో కోటి రూపాయల మున్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ...తనను గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు రూ.22 వేల కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అందులో 5 వేల కోట్లతో జాతీయ రహదారులను నిర్మించినట్లు చెప్పారు. ప్రతి గ్రామానికి రూ.5 లక్షల చొప్పు నిధులు ఇచ్చానని, రాబోయే రోజుల్లో పెద్ద మొత్తంలో నిధులిచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తానని





చెప్పారు. మరోవైపు తనను నమ్మి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను బీజేపీకి అప్పగించిన ప్రజల రుణం తీర్చుకునేందుకు 100 రోజుల్లోనే రూ.840 కోట్ల యూసీఎఫ్ నిధులను తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే స్మార్ట్ సిటీ పేరుతో రూ.940 కోట్ల నిధులు తెచ్చి కరీంనగర్ ను అభివృద్ధి చేసినట్లు వివరించారు. వరంగల్ కు సైతం స్మార్ట్ సిటీ నిధులొచ్చినప్పటికీ... అక్కడ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తనపై నమ్మకం ఉంచిన కరీంనగర్ ను అభివృద్ధి, ఉత్సవాల నిర్వహణలో తెలుగు రాష్ట్రాల్లోనే అగ్రభాగాన ఉంచేందుకు శాయాశక్తుల క్రుషి చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ప్రస్తుతం అభివృద్ధే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా కార్పొరేటర్లంతా కలిసికట్టుగా ఉంటూ కరీంనగర్ ను అభివృద్ధి చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం అనంతరం 16వ డివిజన్ లక్ష్మీపూర్, మల్కాపూర్ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన వాటర్ పైప్ లైన్ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు.



# గన్నేరువరం పీహెచ్‌సీ పనులు వేగవంతం చేయాలి..

**గన్నేరువరం ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** గన్నేరువరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవన నిర్మాణ పనులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన భవనంలోని అన్ని గదులను పరిశీలించి, నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైద్య మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గన్నేరువరం మండల ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్మిస్తున్న నూతన పీహెచ్‌సీ భవనాన్ని అన్ని సౌకర్యాలతో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీ అందుబాటులోకి వస్తే మండల ప్రజలకు స్థానికంగానే మెరుగైన ప్రాథమిక వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. వైద్యులు, సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భవన నిర్మాణం చేపట్టాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాజగోపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పులి కృష్ణ, కొమ్మెర రవీందర్ రెడ్డి, పరిపూర్ణచారి, తిరుపతి తదితరులు ఉన్నారు.

# 20, 21, 16వ డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనచేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



## కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**కరీంనగర్ టౌన్ ఆగస్టు 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 20, 21వ డివిజన్లలో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న పైప్ డ్రైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో



అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.అనంతరం 16వ డివిజన్‌లో 15వ ఫైనాన్స్ నిధులతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయిన అనంతరం డివిజన్ ప్రజలకు మంచినీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీరు, డ్రైనేజీ, రహదారులు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు, పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మేయర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, బండ రమణారెడ్డి, వంగల పవన్, బండారి వేణు, బోయినపల్లి ప్రవీణ్ రావు, గాజా రామ శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు, ఆయా డివిజన్ల ప్రజలు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వందేమాతరం గీతాన్ని కాంగ్రెస్ అవమానించింది: కేంద్ర మంత్రి బండి సంజయ్.



**కరీంనగర్,ఆగస్టు18(పీసీడబ్ల్యూ న్యూస్):** వందేమాతరం గీతాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే అవమానించడం దేశానికే సిగ్గుచేటని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజల్లో దేశభక్తి, స్ఫూర్తిని నింపిన గీతమని అన్నారు. అలాంటి జాతీయ భావోద్వేగాలతో ముడిపడిన గీతాన్ని కాంగ్రెస్ నాయకులు అవమానించడం ద్వారా భారతీయుల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు.దేశభక్తిపైనా కాంగ్రెస్ సెన్సార్ విధిస్తోందా? అని ఆయన ప్రశ్నించారు. వందేమాతరం చరిత్రను సోనియా గాంధీ తెలుసుకోవాలని సూచించారు. దేశం మారితే సరిపోదని, దేశ విలువలు, సంస్కృతి, వేల ఏళ్ల చరిత్రను కూడా ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు."ఇది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదు.. ఇటలీ నేషనల్ కాంగ్రెస్" అంటూ బండి సంజయ్ కాంగ్రెస్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వందేమాతరం గీతాన్ని విని బ్రిటీష్ పాలకులు ఆనాడు భయపడగా, నేడు వందేమాతరం పూర్తి గీతాన్ని చూసి కాంగ్రెస్ వణుకుతోందని విమర్శించారు.వందేమాతరం గీతాన్ని కాంగ్రెస్ అవమానించిన అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకత్వం దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు.అదేవిధంగా ఎంఐఎంపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఎంఐఎంకు దేశభక్తి లేదని ఆరోపించిన బండి సంజయ్.. భారత్‌పై పాకిస్థాన్ విజయం సాధించిన సందర్భంలో కరీంనగర్‌లో సంబరాలు చేసుకున్న చరిత్ర ఎంఐఎం నేతలదేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలను దేశం నుంచి తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విజ్ఞాన విహార యాత్రకు ఢిల్లీ పర్యటనకు మంత్రి బండి సంజయ్ సానుకూల స్పందన




**కరీంనగర్,ఆగస్టు18(పీసీడబ్ల్యూ న్యూస్):** కొత్తపల్లి ZPHS పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను విజ్ఞాన విహార యాత్రలో భాగంగా ఢిల్లీకి తీసుకెళ్లేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్నం రమేష్, కొత్తపల్లి కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్ కలిసి కోరారు.విద్యార్థులకు దేశ రాజధాని ఢిల్లీ చారిత్రక, శాస్త్రీయ మరియు విజ్ఞాన ప్రదేశాలను సందర్శించే అవకాశం కల్పించాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల అభ్యున్నతి, విజ్ఞాన వికాసానికి ఇటువంటి పర్యటనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.వారి విజ్ఞప్తిపై మంత్రి బండి సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందించి, విద్యార్థుల ఢిల్లీ విజ్ఞాన విహార యాత్రకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్నం రమేష్ హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, స్వర్గం నర్సయ్య, చిట్కూరి శ్రీనివాస్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌కు సన్మానించిన ఒగ్గు బిర్లా కళాకారులు..



**రామడుగు, 18 ఆగస్టు (పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు ఒగ్గు బిర్లా కళాకారుల సంఘం రామడుగు గ్రామ సర్పంచ్ ఎండి మోయిజ్ ని మర్యాదపూర్వకంగా కలిసి విరు సన్మానం చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఒగ్గు బిర్లా కళాకారుల సంఘం అధ్యక్షులు ఒగ్గరి రాజు రామడుగు మండలం ఒగ్గు బిర్లా కళాకారుల సంఘం అధ్యక్షులు సాయిళ్ళ రాగుల మల్లయ్య ఉపాధ్యక్షులు బండారి కుమార్ కోశాధికారి ఒగ్గరి తిరుపతి గౌరవ అధ్యక్షులు బీర్ల మల్లయ్య సభ్యులు సాయిళ్ళ రాజు బండి బీరయ్య ఒగ్గరి హరీష్ ఒగ్గరి ఎల్లయ్య బైరి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటది:ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**రామడుగు, 18 ఆగస్టు(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం గోపాల్ రావు పేట్ లోని శుభం గార్డెన్స్ లో రామడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పాలకవర్గ ఆశీర్వాద సభకు ముఖ్య అతిథిగా హాజరైన చొప్పదండి శాసన సభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని సన్మానించి అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, నూతనంగా ఏర్పాటైన పాలకవర్గం రైతుల పట్ల నిబద్ధతతో పనిచేస్తూ వారిలో విశ్వాసం కలిగించేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. మన కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని కావున సింగిల్ విండో ద్వారా రైతులకు అందే ఎరువులు, విత్తనాలు, మరియు పంట ఋణాల పంపిణీని మరింత సులభతరం చేయడంపై నూతన కమిటీ ప్రత్యేకంగా దృష్టి సారించాలని తద్వారా ఈ సొసైటీ దేశానికే ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కోల రమేష్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ ఎంపిపి జవ్వాజి హరీష్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మర వేణి తిరుమల తిరుపతి, గోపాల్రావుపేట సర్పంచ్ ఎడవల్లి వనజ నరేందర్ చొప్పదండి సింగిల్ విండో ఛైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యం రెడ్డి పులి ఆంజనేయులు గౌడ్ బీసీ సెల్ పంజాల శ్రీనివాస్ గౌడ్ జిల్లా నాయకులు, మైనార్టీ సెల్ ఆసిఫ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అనుపురం పరుశరాములు మామిడి దిలీప్ రేణికుంట బాపు రాజు మద్ది ఆంజనేయులు రైతులు ప్రజాప్రతినిధులు, 6 మండలాల కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పలు గ్రామాల సర్పంచులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు ఘన సన్మానం..




**రామడుగు, ఆగస్టు 18 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):** రామడుగు మండల నూతన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజ మల్లయ్యను రామడుగు మాజీ ఎంపీపీ కలిగేటి కవిత లక్ష్మణ్ ఆధ్వర్యంలో పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాజ మల్లయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజ మల్లయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రామడుగు మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జవాజి శేఖర్, జేట్టిపల్లి వీరయ్య, కర్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి..

### ఓటర్లతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలి: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి..




**కరీంనగర్, ఆగస్టు 18 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):** కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 26 మంది బూత్ స్థాయి ఏజెంట్లు2లు, పర్యవేక్షకుల సమావేశం కరీంనగర్ నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కరీంనగర్ నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ఓటర్లతో నిరంతరం సంబంధాలు కొనసాగించడం, ఓట్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఓట్లను రక్షించడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి బూత్ పరిధిలో పార్టీ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని నాయకులు సూచించారు.ఈ సందర్భంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా నిర్మించడంలో బూత్ స్థాయి ఏజెంట్లు2లు, పర్యవేక్షకులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రతి బూత్ పరిధిలోని ఓటర్ల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించి, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల సమాచారం చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు.రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహిస్తూ ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేటర్లు గంట శ్రీనివాస్, జగన్ రెడ్డి, పార్వతుల మల్లేశం, విక్రమ్, సికందర్, ఆకుల ఉదయ్, ఎన్నికల నమోదు అధికారి మోహన్, మహిళా కాంగ్రెస్ నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు2లు, పర్యవేక్షకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ రైతు పరిరక్షణ సమితి మత్స్యకారుల సంఘం అధ్యక్షుడిగా బొమ్మరవేణి మల్లేశం..



**గంగాధర, ఆగస్టు 18 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని రామడుగు మండలానికి చెందిన బొమ్మరవేణి మల్లేశం ముదిరాజ్ను జాతీయ రైతు పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు సంఘం నాయకులు అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. మత్స్యకారుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేయాలనే ఉద్దేశంతో మల్లేశంకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అర్హులైన మత్స్యకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఉమ్మడి జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జాతీయ రైతు పరిరక్షణ సమితి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వారి హక్కులు మరియు సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సంఘాన్ని బలోపేతం చేస్తూ మత్స్యకారులందరినీ ఐక్యంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.ఈ నియామకాన్ని ఉమ్మడి జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు బి.రెడ్డి కరుణాకర్ రెడ్డి మరియు జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ రావు ప్రకటించారు. మల్లేశం నియామకం పట్ల మత్స్యకారులు, ముదిరాజ్ సంఘం నాయకులు, రైతు సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రతి మండల కేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి..

### ట్యాంక్‌బండ్‌పై విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు: పులి ఆంజనేయులు గౌడ్



**కరీంనగర్, ఆగస్టు 18 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):** బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ ఆధ్వర్యంలో మానేరు వంతెనపై ఉన్న సర్వాయి పాపన్న విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా పులి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, బహుజన పోరాట యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ త్యాగాలు, ఆత్మగౌరవ పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సామాన్య ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం సర్వాయి పాపన్న సాగించిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.సర్వాయి పాపన్న చరిత్ర, ఆయన పోరాట స్ఫూర్తి భావితరాలకు చేరేలా రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠ్యాంశాల్లో ఆయన చరిత్రకు తగిన ప్రాధాన్యత కల్పించడంతో పాటు, యువతకు ఆయన జీవిత చరిత్రను వివరించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అలాగే హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుకు కృషి చేసిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్కు, రాష్ట్ర ప్రభుత్వానికి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడిన మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.సర్వాయి పాపన్న చూపిన ధైర్యం, సమానత్వం, ఆత్మగౌరవం వంటి విలువలను సమాజంలో మరింత విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా భావితరాలకు స్ఫూర్తిని అందించవచ్చని అన్నారు.జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మాజీ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్ కుమార్, కలర్ సత్తన్న, కాంగ్రెస్ నాయకులు కొలగాని అనిల్ కుమార్, కుంభాల రాజ్ కుమార్, జి.ఎస్. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ విజయం లాంఛనమే!!

**భారత్ రెండో ఇన్నింగ్స్‌లో193కి ఆలౌట్**

**372.. శ్రీలంక ముందు భారీ లక్ష్య ఛేదన**

**గెలుపుకు ఆరు వికెట్ల ముంగిట భారత్**

**శ్రీలంక విజయానికి 288 పరుగులు**

**గెలుపుకు చివరి రోజు మిగిలిన ఆట**



శ్రీలంకతో తొలి టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. కానీ వరణుడిపైనే భారత్ విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి. బుధవారం ఆఖరి రోజు ఆటలో వరణుడు రెండు సెషన్ల పాటు అంతరాయం కలిగించకపోతే భారత్ విజయం లాంఛనం కానుంది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 4 వికెట్లకు 84 పరుగులు చేసింది. క్రీజులో ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) ఉన్నారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ తలో వికెట్ తీసారు. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 48.5 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(69 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. దేవదత్ పడిక్కల్(75 బంతుల్లో 6 ఫోర్లతో 44) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/31) నాలుగు వికెట్లు తీయగా.. ప్రబాత్ జయసూర్య(3/43) మూడు వికెట్లు పడగొట్టాడు. కేశర నువాంత ఒక వికెట్ తీయగా.. లాహిరు కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగల భారీ ఆధిక్యం సాధించడంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నమోదైంది. నాలుగో రోజు ఆటలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. యశస్వి జైస్వాల్.. మూడో బంతికే డకౌట్ కాగా.. కేఎల్ రాహుల్(35), దేవదత్ పడిక్కల్(44) వేగంగా పరుగులు చేశారు. ఈ క్రమంలో రాహుల్‌ను ప్రభాత్ జయసూర్య ఔట్ చేయగా.. పడిక్కల్(44)ను కేశర నువంత పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 116/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే ధ్రువ్ జురెల్ ఔటైనా.. రవీంద్ర జడేజాతో(9) రిషభ్ పంత్ దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో 53 బంతుల్లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

శతకం దిశగా సాగిన పంత్(66)ను లాహిరు కుమార ఔట్ చేశాడు. పంత్ వికెట్ తర్వాత భారత ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. అయితే మూడో సెషన్ ఆటకు ముందు వర్షం అంతరాయం కలిగించింది. ఆఖరి సెషన్‌లో భారత్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.

# ధ్రువ్ జురెల్ స్టన్నింగ్ క్యాచ్‌పై దుమారం



భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో అంపైర్ల నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమవుతున్నాయి. ఎల్బీడబ్ల్యూ, క్యాచ్‌ల విషయంలో అంపైర్లపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అంపైర్ల తీరు కారణంగానే తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేసిందని మూడో రోజు ఆట అనంతరం భారత స్పిన్నర్ మానవ్ సుతార్ అనడం తీవ్ర వివాదాస్పదమైంది. నాలుగో రోజు ఆటలో కేఎల్ రాహుల్ ఎల్బీడబ్ల్యూ విషయంలో అంపైర్ ఘోర తప్పిదం చేయడం.. డీఆర్ఎస్ ద్వారా అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకోవడం కూడా చర్చనీయాంశమైంది. ఆఖరి సెషన్‌లో భారత ఫీల్డర్ ధ్రువ్ జురెల్ అందుకున్న లో-క్యాచ్‌పై కూడా దుమారం రేగుతోంది. శ్రీలంక ఓపెనర్ లాహిరు ఉడారా ఇచ్చిన లో- స్లిప్ క్యాచ్‌ను ధ్రువ్ జురెల్ అద్భుతంగా అందుకున్నాడు. అయితే క్యాచ్ అందుకునే క్రమంలో బంతి నేలకు తాకినట్లుగా రిప్లేలో కనిపించింది. కానీ ఫీల్డ్ అంపైర్ ఔటిచ్చాడు. ఈ నిర్ణయంపై శ్రీలంక కోచ్‌లు, ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీలంక రెండో ఇన్నింగ్స్ సందర్భంగా మానవ్ సుతార్ వేసిన 22వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ నాలుగో బంతిని లాహిరు ఉడారా డిఫెన్స్ చేయగా బంతి గల్లీ వైపు లో-క్యాచ్‌గా వచ్చింది. అక్కడే ఉన్న ధ్రువ్ జురెల్ బంతిని అద్భుతంగా అందుకున్నాడు. రిప్లేలను పరిశీలించిన అంపైర్ బంతి కింద చేతివేళ్లు ఉన్నాయని ఔటిచ్చాడు. అయితే ఈ నిర్ణయంపై లాహిరు ఉడారా అసంతృప్తి వ్యక్తం చేశాడు. అసహనంగా క్రీజును వీడాడు. ప్రస్తుతం ఈ క్యాచ్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.




# శ్రీలంక ఆటగాడి మెడకు తీవ్ర గాయం..

భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో దురదృష్టకర ఘటన చోటు చేసుకుంది. మంగళవారం నాలుగో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తూ శ్రీలంక ఫీల్డర్ దినేష్ చండీమల్ తీవ్రంగా గాయపడ్డాడు. బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపే క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయిన చండీమల్‌కు మెడతో పాటు కుడి భుజానికి బలమైన గాయమైంది. దాంతో అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. నాలుగో రోజు ఆట తొలి సెషన్ ఆరంభంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. కేశర నువాంత వేసిన నాలుగో ఓవర్ ఆఖరి బంతిని కేఎల్ రాహుల్.. స్వీప్ షాట్‌తో డీప్ బ్యాక్‌వార్డ్ స్క్వేర్ లెగ్ దిశగా ఆడగా.. దినేష్ చండీమల్ పరుగెత్తుకుంటూ వచ్చి బంతిని ఆపే ప్రయత్నంలో కిందపడిపోయాడు. ఈ క్రమంలో అతని కుడి భుజం బలంగా నేలకు తాకడంతో మెడకు తీవ్ర గాయమైంది. ఫిజియోలు పరీక్షించి అతన్ని ఆసుపత్రికి తరలించారు. అయితే అతని స్కానింగ్ తీయించామని, అంతర్గత గాయాలు ఏమి లేవని శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. కంకషన్ టెస్ట్‌లో చండిమాల్ విఫలమయ్యాడని, దాంతో అతను ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని తెలిపింది. అతని స్థానంలో పసిందు సూర్య బండార ఆడుతాడని పేర్కొంది. కంకషన్ సబ్‌స్టిట్యూట్‌కు మ్యాచ్ రిఫరీ ఆమోదం తెలిపారని తమ ప్రకటనలో స్పష్టం చేసింది. దాంతో అనూహ్య పరిస్థితుల్లో సూర్య బండార అంతర్జాతీయ టెస్ట్‌ల్లోకి అరంగేట్రం చేశాడు. అయితే తన రాకను ఘనంగా చాటుకోలేకపోయాడు. 372 పరుగుల లక్ష్య ఛేదన కోసం శ్రీలంక రెండో ఇన్నింగ్స్ ప్రారంభించగా.. సూర్య బండార(0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. మానవ్ సుతార్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. మానవ్ సుతార్‌తో పాటు సిరాజ్, ప్రసిధ్ కృష్ణ సత్తా చాటడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో కెప్టెన్ దనంజయ డిసిల్వా(24 బ్యాటింగ్), సోనాల్ దినుషా(8 బ్యాటింగ్) ఉన్నారు. భారత్ విజయానికి ఇంకా 6 వికెట్లు అవసరం కాగా.. శ్రీలంక 300 ప్లస్ రన్స్ చేయాల్సి ఉంది.

# గాయత్రీ , శ్రీకాంత్‌లకు అర్జున అవార్డు..

**మొత్తం 17 మందికి ఈ పురస్కారాలు**




కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్ఠాత్మక నేషనల్ స్పోర్ట్స్ అవార్డ్స్ 2025 జాబితాను మంగళవారం అధికారికంగా ప్రకటించింది. తెలుగు తేజం, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రి, షూటర్ శ్రీకాంత్ లకు ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు దక్కింది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అయిన గాయత్రీ, షూటర్ అయిన శ్రీకాంత్.. సాధించిన ఘనతలకు మెచ్చి, కేంద్రం ఈ పురస్కారం ప్రకటించింది. వీరితోతోపాటు మొత్తం 17 మంది అథ్లెట్లకు అర్జున అవార్డులు దక్కగా, ఒకరికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం లభించింది. అయితే ఈ అవార్డుల ప్రకటనలో అందరినీ ఆశ్చర్యపరిచిన అంశం దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఒక్కరి పేరు కూడా ఎంపిక కాకపోవడమే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం ఈ అవార్డులను ఖరారు చేసింది. గత నాలుగేళ్ల కాలంలో అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు ఖేల్ రత్న పురస్కారాన్ని అందిస్తుంటారు. 2024 లో చెస్ వరల్డ్ ఛాంపియన్ గుకేశ్ దొమ్మరాజు, ఇండియన్ మెన్స్ హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్ లకు ఖేల్ రత్న లభించింది. కానీ 2025 అవార్డుల సైకిల్‌లో ఏ ఒక్క క్రీడాకారుడి పేరును కమిటీ నామినేట్ చేయకపోవడంతో ఈ అత్యున్నత గౌరవ జాబితా ఖాళీగా మిగిలిపోయింది. గత నాలుగేళ్లలో నిలకడైన ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ ప్రదర్శించిన వారికి అర్జున అవార్డులను ప్రకటించారు. హైజంపర్ తేజస్విన్ శంకర్, స్ప్రింటర్లు మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి, బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ త్రీసా జాలీ, చెస్ గ్రాండ్‌మాస్టర్లు విదిత్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్, హాకీ స్టార్లు లాల్‌రెమ్‌సియామి, రాజ్‌కుమార్ పాల్, షూటర్ అఖిల్ షెరాన్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును దక్కించుకున్నారు. వీరితో పాటు పారా షూటర్ రుద్రాంశ్ ఖండేల్వాల్, పారా అథ్లెట్ ఏక్తా భ్యాన్, రోయింగ్ ప్లేయర్ అరవింద్ సింగ్, బాక్సర్ నరేందర్, కబడ్డీ ప్లేయర్లు సుర్జీత్, పూజ, డెఫ్ షూటర్ ధనుష్ శ్రీకాంత్.. అర్జున అవార్డు గ్రహీతల జాబితాలో నిలిచారు. 1962 ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించిన భారత ఫుట్‌బాల్ టీమ్ సభ్యుడు ఐ. అరుమై నాయగం కు లైఫ్‌టైమ్ కేటగిరీలో అర్జున అవార్డు దక్కింది. కోచ్ లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డుల రెగ్యులర్ కేటగిరీలో అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్ ఛోటే లాల్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్ ఎంపికయ్యారు. లైఫ్‌టైమ్ కేటగిరీలో బాక్సింగ్ కోచ్ ధర్మేంద్ర సింగ్ యాదవ్, రెజ్లింగ్ కోచ్ వీరేందర్ కుమార్ లకు ద్రోణాచార్య దక్కింది. క్రీడల ప్రోత్సాహానికి కృషి చేసిన కార్పొరేట్, ఎన్జీవో విభాగంలో అందించే రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం పూణేకు చెందిన ఆర్మీ పారాలింపిక్ నోడ్ కు లభించింది. ఖేల్ రత్న అవార్డు లేకపోవడం మినహా మిగతా విభాగాల్లో పెద్ద సంఖ్యలోనే భారతీయ క్రీడాకారులకు గుర్తింపు లభించింది.

# లక్ష్యసేన్ శుభారంభం

**ప్రీ క్వార్టర్స్‌లో గాయత్రి, ట్రెసా జోడీ**

**బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్**




**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో 14వ సీడ్, భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ తొలి రౌండ్లో గట్టెక్కాడు. మంగళవారం న్యూఢిల్లీలోని ఇంధిరాగాంధీ ఇండోర్‌స్టేడియంలో జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ఆస్ట్రియా ఆటగాడు కొలిన్స్ వాలంటైన్ ఫిలిమాన్‌పై లక్ష్యసేన్ 16-21, 21-8, 21-4తో మూడు గేముల మ్యాచ్‌లో గెలుపొందాడు. తొలి గేమ్‌లో 16-21తో తడబడిన లక్ష్యసేన్ 15 నిమిషాల్లో కంగుతిన్నాడు. కానీ ఆ తర్వాత వరుస గేములను అలవోకగా 30 నిమిషాల్లోనే నెగ్గాడు. తొలి గేమ్, తర్వాతి రెండు గేమ్‌ల్లో భిన్నమైన ఆటతీరుతో లక్ష్యసేన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌ను విజయంతో మొదలెట్టాడు.


మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా సైతం తొలి రౌండ్లో అలవోక విజయం సాధించింది.

మయన్మార్ షట్లర్ తుజార్‌పై 22-20, 21-16తో ఉన్నతి హుడా 40 నిమిషాల్లోనే రెండో రౌండ్‌కు చేరుకుంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి, ట్రెసా జోడీ 21-15, 21-12తో 16వ సీడ్ అమెరికా జోడీ లారెన్, అలిసన్‌లను వరుస గేముల్లో మట్టికరిపించి ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. కవిప్రియ, సిమ్రన్ సింఘి జంట 7-21, 14-21తో రెండో రౌండ్ల నిరాశపరచగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో అసిత్ సూర్య, అమృత జోడీ 21-16, 29-30, 22-24తో పోరాడి ఓడింది. రోహన్ కపూర్, రుత్విక శివాని జంట సైతం 22-20, 10-21, 17-21తో మూడు గేముల మ్యాచ్‌లో పోరాడి ఓడింది.

PCW తెలుగు దినపత్రిక



# అక్టోబర్ 2న రానున్న సందీప్ కిషన్ సిగ్మా




కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవు తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇకపోతే ఈ సినిమాలో అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సినిమాలో 'మల్లెపూల పల్లకి బంగారు పల్లకి' అంటూ సాగే పాటలో రామ్ చరణ్ అయ్యప్ప మాలధారణలో కనిపిస్తారని.. కొన్ని పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిపై రామ్‌చరణ్ టీమ్ తాజాగా స్పందించింది. అవి రూమర్స్ అంటూ ఖండించింది. అసత్యాలను ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేసింది.

# అనుపమ వ్యాఖ్యల ఎఫెక్ట్..


## తొలిసారి మౌనం వీడిన ధ్రువ్ విక్రమ్!



గత కొన్ని వారాలుగా తన వ్యక్తిగత జీవితంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై యువ నటుడు ధ్రువ్ విక్రమ్ తొలిసారి బహిరంగంగా స్పందించాడు. తన సహనటి అనుపమ పరమేశ్వరన్ గతంలో ఓ రెండేళ్ల సంబంధంలో తాను ఎదుర్కొన్న నియంతృత్వం, నార్సిసిజం గురించి మాట్లాడిన తర్వాత, ఆ వ్యాఖ్యలు ధ్రువ్‌ను ఉద్దేశించేనని పెద్ద ఎత్తున ఊహాగానాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలోనే ధ్రువ్ మౌనం వీడాడు.'ఇండియా టుడే తమిళ్' నిర్వహించిన ఒక రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ధ్రువ్‌ను.. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఈ ప్రచారాన్ని ఎలా ఎదుర్కొంటున్నారని ప్రశ్నించగా.. "నిజం చెప్పాలంటే, ఈ ప్రచారం నన్ను ప్రభావితం చేయలేదని నేను చెప్పలేను. కచ్చితంగా దాని ప్రభావం నాపై పడింది. కానీ, ఇలాంటి సమయంలో వాస్తవానికి కట్టుబడి ఉండటం చాలా ముఖ్యం. మనం ఎవరో, మన విలువేంటో తెలుసుకోవాలి. మనం ప్రేమించే వారిని, మనకు ముఖ్యమైన ప్రతి ఒక్కరినీ కాపాడుకోవాలి" అని ఆయన అన్నారు. బయటివారి అభిప్రాయాల ప్రభావం తనపై ఎక్కువగా ఉండదని చెబుతూ, "మీరు నిజానికి కట్టుబడి ఉన్నప్పుడు, మిమ్మల్ని ఏది నిలబెడుతుందో మీకు తెలిసినప్పుడు, బయటివారి విమర్శలు ఓ స్థాయిని దాటి వెళ్లలేవు. మనకు తెలియకుండానే మనం ఒంటరి సైన్యంలా మారతాం. మనకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకుని, మన అంతర్గత బలాన్ని కాపాడుకుంటాం" అని ధ్రువ్ వివరించాడు.ప్రముఖుల జీవితాల్లో ఇలాంటి పరిశీలన సర్వసాధారణమే అయినా, తన ప్రియమైన వారిని కాపాడుకోవడం, వ్యక్తిగత హద్దులు గీసుకోవడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నాడు. అయితే, ఈ సంభాషణలో ఆయన ఎక్కడా అనుపమ వ్యాఖ్యలను నేరుగా ప్రస్తావించలేదు. వారిద్దరి మధ్య ఏదైనా సంబంధం ఉందన్న ఊహాగానాలపై కూడా స్పందించకుండా సంయమనం పాటించాడు. ప్రస్తుతం ధ్రువ్ విక్రమ్, అనుపమ పరమేశ్వరన్ కలిసి 'బైసన్ కాలమాడన్' అనే చిత్రంలో నటిస్తున్నారు

# ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్

## రామ్‌చరణ్ గెస్ట్ రోల్ ప్రచారాలను ఖండించిన టీమ్




టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.

----




# డిసి చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు

తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ. 85 కోట్ల వసూళ్లను సాధించి, రూ. 100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా ఉంటుందని' బన్నీ అభివర్ణించారు. ఇక దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైల్‌కు తాను ఫిదా అయ్యానని తెలుపుతూ, చిత్ర బృందం మొత్తానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును అబ్సల్యూట్ మాస్టర్ బూస్టర్‌గా బన్నీ అభివర్ణించారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కిందని ఆయన పేర్కొన్నారు. నటీనటుల విషయానికి వస్తే, వామికా గబ్బి నటన అద్భుతమని మెచ్చుకుంటూనే, ప్రధాన పాత్రలో హీరోగా నటించిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ నటనను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన మిత్రుడు లోకేష్ కనగరాజ్ తనకు ఎల్లప్పుడూ ఒక గొప్ప మద్దతుగా ఉంటారని అల్లు అర్జున్ సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన కొద్ది కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతూ, సినీ వర్గాల్లో 'డీసీ' మూవీ హాట్ టాపిక్‌గా మారింది.

-------------

# సంక్రాంతి బరిలో మెగా 158 మూవీ




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బ్జడెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్– శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.



# నిధి అగర్వాల్ కొత్త సినిమా..

## మైథలాజికల్ థ్రిల్లర్!

హీరోయిన్ నిధి అగర్వాల్ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈసారి ఆమె ఓ విభిన్న కథతో అలరించనున్నట్లు తెలుస్తోంది. నిధి తదుపరి చిత్రం మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుందని సినీ వర్గాల సమాచారం. హీరోయిన్ ప్రధానంగా సాగే ఈ కథలో ఆమె ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా ఆ సంస్థకు తొలి ప్రొడక్షన్. సునీత్ పడోల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నాడు. నిధి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. అదే రోజు చిత్రీకరణ కూడా మొదలైంది.సినిమా ప్రారంభోత్సవంలో పి. అశోక్, పి. రేణుక తొలి షాట్‌కు కెమెరా స్విచాన్ చేశారు. నిధి అగర్వాల్ చిత్రబృందంతో కలిసి కార్యక్రమంలో పాల్గొంది. ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్', పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీర మల్లు' చిత్రాల్లో నిధి నటనకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తోంది.సినిమా ప్రారంభం సందర్భంగా మేకర్స్ నిధి ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు. అందులో ఆమె ఒక చేతిలో దీపం పట్టుకుని.. మరో చేతితో దానికి రక్షణగా నిలిచినట్లు కనిపిస్తోంది. వెనుక భాగంలో అనేక చేతులతో ఉన్న దేవత ఆకారం కనిపిస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి హీరోయిన్ చుట్టూ తిరిగేలా బలమైన కథను సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే సినిమా టైటిల్‌ను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.